


చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.120

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.120 పలికింది. కనిష్టం రూ.75, సరాసరి రూ.95 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రమీల



అనంతపురం కల్చరల్: ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా జిల్లాకు చెందిన హనుమన్న గారి ప్రమీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బడుగు, బలహీన వర్గాలవారికి మరోసారి సమున్నత పదవినిచ్చి గౌరవించింది. నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ఉన్న రాగే హరిత పదవీకాలం ముగియడంతో మరోసారి జిల్లావాసికే ఆ అవకాశం కల్పించింది. శింగనమల మండలం బండమీదిపల్లికి చెందిన వీరాంజనేయులు భార్య ప్రమీల పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామానికి చెందినవారు. ఆమె డిగ్రీ వరకు తాడిపత్రిలో చదువుకున్నారు. తొలుత వీరాంజనేయులు కుటుంబం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచింది. వీరాంజనేయులు తండ్రి వెంకటప్ప గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన ప్రమీల తల్లి లక్ష్మీదేవి కూడా సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఈ నేపథ్యంలో దళితులకు మరోసారి గొప్ప అవకాశం ఇవ్వడం పట్ల వీరాంజనేయులు, ప్రమీల హర్షం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసిన సీఎం జగన్‌కు, సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చే విధంగా కళాకారుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తామని ప్రమీల తెలిపారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

అనంతపురం రూరల్: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నాదొరై తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు. గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మట్కా నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గుత్తి: మట్కా నిర్మూలనకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. గుత్తి పోలీసు స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ మట్కాతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదన్నారు. వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, రామచంద్రారెడ్డి, జగన్నాథ్, ఆజాద్, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గడువులోపు రీ సర్వే పూర్తవ్వాలి



సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో సర్వే ఏడీ రూప్లానాయక్

అనంతపురం అర్బన్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రెండో విడత కింద 57 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే గడువులోగా వందశాతం పూర్తవ్వాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. రీ–సర్వే అంశంపై ఆయన మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్‌తో కలిసి సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సర్వేకు సంబంధించి 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందిన ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, 31 మంది సర్వేయర్లు పాల్గొన్నారు.

జిల్లాకు 1,740 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: కోరమాండల్ కంపెనీ నుంచి 1,740 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో వ్యాగన్లలో వచ్చిన ఎరువులను పరిశీలించారు.

సాధికారతకు సాయం

బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించి.. స్వయం ఉపాధిని పెంపొందించి అక్కచెల్లెమ్మలు ఆర్థిక సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. డ్వాక్రా అక్కాచెల్లెమ్మల ఇబ్బందులను నాడు పాదయాత్రలో స్వయంగా గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వారికి ఆర్థిక చేయూత నిచ్చేందుకు అనే పథకాలకు శ్రీకారం చుట్టారు. అందులో 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం ఒకటి.

- అక్కచెల్లెమ్మలకు వరం.. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం
- ఇప్పటికే మూడు విడతల్లో రూ.159.84 కోట్లు వర్తింపు
- 11న నాలుగో విడతగా జిల్లాకు రూ.42.95 కోట్లు విడుదల



అనంతపురంలో సమావేశమైన డ్వాక్రా మహిళలు (ఫైల్)

అనంతపురం: పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధిని మెరుగుపరచుకునేందుకు జగన్ సర్కారు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో అండగా నిలుస్తోంది. వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఆర్థిక ఉపశమనం కల్పిస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదా చెల్లించిన అన్ని సంఘాలకూ 'వైఎస్సార్ సున్నా వడ్డీ' వస్తుంది. సంఘం అప్పు నిల్వలో రూ.3 లక్షల వరకు మాత్రమే సున్నా వడ్డీ వర్తిస్తుంది. క్యాష్ క్రెడిట్ లిమిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతి నెలా, గత నెలాఖరునాటికి ఉన్న అప్పు నిల్వలో కనీసం 3 శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలి. ఒక వేళ టర్మ్ లోన్ అయితే ఏ నెలలో ఎంత కంతు చెల్లించాలో అంత ఆ నెలాఖరునాటికి చెల్లించి ఉండాలి. వైఎస్సార్ సున్నా వడ్డీ అర్హతను ప్రతి నెలా ధ్రువీకరించి లెక్కిస్తారు. కంతుల బకాయి పూర్తిగా చెల్లించిన తర్వాతే సంఘాలు సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆ నెలకు మాత్రమే సున్నా వడ్డీని పొందుతారు. ప్రస్తుత అప్పు నిల్వ, అప్పు మంజూరైన మొత్తానికి సమానంగా కానీ, లేక తక్కువగా కానీ ఉన్న సంఘాలు మాత్రమే అర్హత పొందుతాయి.

నేరుగా ఖాతాకే జమ

వైఎస్సార్ సున్నా వడ్డీ మొత్తం ప్రభుత్వం నేరుగా స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) అప్పు ఖాతాకు జమచేస్తుంది. ఒక వేళ అప్పు ఖాతా క్లోజ్ అయ్యి ఉంటే సంఘం పొదుపు ఖాతాకు జమవుతుంది.

వడ్డీ రేట్లు తగ్గించిన విధానం

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లతో మాట్లాడి స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న బ్యాంకు రుణాలపై వడ్డీ రేట్లను 13.50 నుంచి 9.50 శాతానికి తగ్గించారు. దీని వల్ల తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకుల నుంచి అధిక మొత్తంలో రుణాలు పొంది సంఘం సభ్యులు సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని 2020 ఏప్రిల్ 24 నుంచి అమలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం మూడు దఫాలుగా అర్హత గల స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీల)కు 'వైఎస్సార్ సున్నా వడ్డీ'ని నేరుగా చెల్లించింది.

11న నాలుగో విడత..

వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నాలుగో సంవత్సరం కూడా కొనసాగిస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో బ్యాంకులకు రుణ కంతులు చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ సంవత్సరం తీసుకున్న కొత్త రుణాలకు కూడా సున్నా వడ్డీ వర్తింపజేస్తూ ఆ మొత్తాన్ని సంఘాల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న అమలాపురం నుంచి ప్రారంభించనున్నారు.

- జిల్లాలోని 31,868 పొదుపు సంఘాల అప్పు ఖాతాలకు నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.42.95 కోట్లు నేరుగా చెల్లించనున్నారు. దీని ద్వారా సంఘాలు ఏర్పాటు చేసుకునే చిన్న తరహా వ్యాపారాలు మరింత లాభదాయకంగా, వడ్డీ భారం లేకుండా నడపడానికి, మెరుగైన జీవనం సాగించడానికి ఈ సున్నా వడ్డీ పథకం ఎంతగానో దోహదపడుతుంది.
- 2019–20 ఆర్థిక సంవత్సరంలో 26,694 సంఘాలకు రూ.56.99 కోట్లు, 2020–21లో 31,471 సంఘాలకు రూ.49.23 కోట్లు, 2021–22లో 32,441 సంఘాలకు రూ.53.82 కోట్లు, తాజాగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 31,868 సంఘాలకు రూ.42.95 కోట్లు కలిపి మొత్తం రూ.203. కోట్లు సున్నావడ్డీ కింద రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది.

రుణ పరపతి పెరిగింది

బ్యాంకుల నుంచి స్త్రీనిధి, ఉన్నతి వంటి అనేక పథకాల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం వలన స్వయం సహాయక సంఘాలు/డ్వాక్రా గ్రూపు సభ్యుల స్వయం ఉపాధికి అవసరమైన పెట్టుబడికి నిధులు సమకూరుతున్నాయి. మహిళల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నాం.



మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణ వలన రుణ పరపతి బాగా పెరిగింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద నాలుగో విడతలకు కలిపి మొత్తం రూ.203 కోట్ల మేర మహిళా సంఘాలకు లబ్ధి చేకూరింది.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

ఎస్‌బీఐలో రూ.కోటి స్వాహా

- మేనేజరే సూత్రధారి
- బినామీ ఖాతాలకు నగదు మళ్లింపు
- డీజీఎం ఫిర్యాదుతో కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగులోకి..



రాయదుర్గం: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో రూ.కోటి నగదు స్వాహా అయ్యింది. ఈ విషయం రెండు నెలల తర్వాత ఆలస్యంగా బయటకు పొక్కింది. మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గతంలో ఇక్కడ మేనేజర్‌గా ఎస్‌ఎల్ఎస్ ఫణికుమార్ పని చేశారు. ఆయన తన తల్లితో పాటు ఇతరుల ఖాతాలకు రూ.1,00,07,323 నగదును మళ్లించారు. దీన్ని ఉన్నతాధికారులు గుర్తించి తనిఖీలు నిర్వహించారు. నగదు ఇతరుల ఖాతాలకు అక్రమంగా మళ్లించినట్లు నిర్ధారించుకున్నారు. ఈ ఏడాది జూన్ 21న ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేనేజర్‌పై 409, 420, 468, 471, 477–ఏ ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ విషయం బయటకు పొక్కకుండా ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసులు ఇన్నాళ్లూ జాగ్రత్తపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎట్టకేలకు బహిర్గతమైంది. బ్యాంకు అధికారులు నగదు రికవరీ చేయడంతో పాటు మేనేజరును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా మన్మధరావు

అనంతపురం: జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు నియమితులయ్యారు. గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిని పోర్ట్‌ఫోలియో జడ్జిగా పిలిచేవారు. జిల్లా ప్రిన్సిపల్ జడ్జితో పాటుగా ఇతర జిల్లా జడ్జీలు, జిల్లా పరిధిలోని ఆయా కోర్టుల జడ్జీలు.. అడ్మినిస్ట్రేటివ్ జడ్జి పరిధిలో విధులు నిర్వరిస్తారు. కేసుల స్థితిగతులు, సత్వర పరిష్కారం, కోర్టుల్లో పాలనా పరమైన అంశాలు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి పర్యవేక్షణలోనే జరగనున్నాయి.

లింగ నిర్ధారణ నేరం

- బాలికల నిష్పత్తిపై అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఎంహెచ్‌ఓ యుగంధర్

అనంతపురం అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని కలెక్టర్ గౌతమి తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లాస్థాయి జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భ్రూణహత్యలకు కారణమవుతున్న గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను కట్టడి చేసేందుకు తరచూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో, ఏఎన్ఎం, మహిళా సంరక్షకురాలు, అంగన్‌వాడీ వర్కర్, ఆశా వర్కర్ కమిటీగా ఏర్పడి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దారు చైర్మన్‌గా వైద్యాధికారి కన్వీనర్‌గా ఎంపీడీఓ, సీఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఆశా నోడల్ అధికారి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఒక కమిటీగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలికల నిష్పత్తి తగ్గితే కలిగే అనర్థాల గురించి కళారూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ యుగంధర్, ఏఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, జిల్లా ఆస్పత్రుల కో–ఆర్డినేటర్ కృష్ణవేణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ నోడల్ అధికారి వనజాక్షి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, విద్యాశాఖ ఏడీ నాగరాజు, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ సిరప్ప, రెడ్స్ సంస్థ భానుజా, హెడ్స్ సంస్థ విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజికసేవ ఒక బాధ్యత

ప్రతి ఒక్కరూ సామాజిక సేవను ఒక బాధ్యతగా భావించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈఎన్‌టీ, బ్లడ్‌బ్యాంక్, అత్యవసర పరికరాల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద సప్తగిరి క్యాంఫర్ కంపెనీ రూ.11 లక్షలు అందించడం హర్షణీయమని అభినందించారు. కలెక్టర్‌ను కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ హనీఫ్ మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి రూ.11 లక్షల చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ కింద జిల్లా అభివృద్ధికి పరిశ్రమలు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, డీఆర్వో గాయత్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపాలి

అనంతపురం అర్బన్: 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో రోజువారీ పురోగతి చూపించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల, మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 18న సామూహిక గృహప్రవేశాలు నిర్వహించనున్నామన్నారు. నిర్దేశించిన 20 వేల ఇళ్లను ఈ నెల 15లోగా పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని చెప్పారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ సర్వే

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సర్వే అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విమర్శలకు తావివ్వకుండా నిబద్ధతతో సర్వే నిర్వహించాలని చెప్పారు. బీఎల్‌ఓలు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి ఓటరుతో మాట్లాడి వివరాలు తీసుకుని చేర్పులు, మార్పులు చేపట్టాలన్నారు.

కల్యాణం.. సర్కారు సాయంతో కమనీయం

- నేడు లబ్ధిదారుల ఖాతాలకు 'కల్యాణమస్తు' నగదు జమ

అనంతపురం: పేదింటి అమ్మాయిల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు/వైఎస్సార్ షాదీ తోఫా అండగా నిలుస్తున్నాయి. ఈ పథకాల కింద అర్హులైన లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ బుధవారం కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభిస్తారు. మే నుంచి జూలై త్రైమాసికంలో పెళ్లి చేసుకున్న అర్హులైన వారికి ఆర్థికసాయం అందజేయనున్నారు. జిల్లాలో 'వైఎస్సార్ కల్యాణమస్తు', 'వైఎస్సార్ షాదీ తోఫా' కింద 836 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మిక పెళ్లి కుమార్తెల తల్లుల ఖాతాలకు రూ.6.49 కోట్లు జమ చేయనున్నారు.



ఎవరెవరికి ఎంత అంటే..

వివాహం చేసుకున్న మైనార్టీలకు అయితే రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50వేలు, బీసీ కులాంతర వివాహానికి రూ.75వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, రిజిస్టర్డ్ భవన నిర్మాణ కార్మికులకు రూ.40వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల తల్లుల ఖాతాలకు, తల్లులు లేకుంటే ఆడపిల్లల ఖాతాలకు నగదును నేరుగా జమ చేస్తుంది.

జిల్లా వ్యాప్తంగా త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న వారి వివరాలు..

కేటగిరి	కులాంతర	అదే కులంలో..	మొత్తం సంఖ్య	రూ.లక్షల్లో
బీసీ	7	385	392	197.75
దివ్యాంగులు	14	--	14	21.00
మైనార్టీ	189	--	189	189.00
ఎస్సీ	2	183	185	185.40
ఎస్టీ	1	54	55	55.20
క్రిస్టియన్	1	--	1	0.75
మొత్తం	214	622	836	649.10

'పాప'ం.. పసికందు!

అప్పుడప్పుడే కళ్లు తెరిచిన ఆడశిశువు.. ముట్టు ఆరనేలేదు.. బొడ్డు కోయనేలేదు.. అంతలోనే 'పాప'ం.. తల్లి ఒడికి దూరమైంది.. అబలని భారమనుకున్నారా.. అరిష్టమని భావించారో.. మండే ఎండలో ముళ్ల పొదల మాటున ఒంటరయ్యింది. అంతా నిర్మానుష్యం.. లాలించేవారులేరు.. పాలుపట్టేదెవరు..? దిక్కులు పిక్కటిల్లేలా గుక్కపెట్టి ఏడుస్తుంటే.. ఈ ఆక్రందన అటుగా వెళ్లేవారి చెవిన పడింది. వెతికి వెతికి చూడగా మట్టిపై పడి ఉన్న పసికందు కంటపడింది. చేతపట్టి, పోలీసులకు అప్పగించారు.



వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆడ శిశువు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు మంగళవారం నగర శివారులోని రాజీవ్‌కాలనీ పంచాయతీ రిక్షాకాలనీ రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి చేరింది. ఆకలికి అలమటించింది. ఓ వైపు ఎండకు భూమి వేడెక్కుతోంది. భరించలేని పసికందు ఏడవటం మొదలెట్టింది. ఎంతసేపటి నుంచి ఆక్రందన చేస్తోందో తెలియదు గానీ ఉదయం పదిన్నర గంటల సమయంలో అటువైపు వెళ్తున్న వారికి వినిపించింది. వెతుకుతూ పోతే ముళ్ల పొదల నడుమ పండంటి ఆడబిడ్డ కనిపించింది. దగ్గరకు తీసుకుని చూస్తే బొడ్డు పేగు కూడా అలానే ఉంది. ఇంటిలోనో.. లేక నిర్మానుష్య ప్రదేశంలోనే ప్రసవం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఆడపిల్ల అని భారమనుకున్నారో.. లేక ఎవరైనా కుటుంబ సభ్యులకు తెలియకుండా కక్షతో శిశువును తీసుకొచ్చేశారో.. లేదా పెళ్లి కాకనే గర్భం దాల్చి ప్రసవించడం వల్ల సమాజానికి చూపించలేక ఇలా వదిలించుకున్నారో తెలియదు. స్థానికులు అయ్యో పాపం అంటూ దగ్గరికి తీసుకున్నారు. డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు హుటాహుటిన రిక్షాకాలనీకి చేరుకున్నారు. పాపను తీసుకుని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వారు సర్వజనాస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ప్రస్తుతం పాప వైద్యుల పర్యవేక్షణలో ఉంది.

చదువుతోనే బంగారు భవిత



పామిడి టీసీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

గార్లదిన్నె/పామిడి/గుత్తి/గుత్తి రూరల్/ గుంతకల్లు రూరల్: విద్యార్థులు బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. విద్యార్థులకు చదువే ఆస్తి కావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, బోధన ప్రమాణాలు మెరుగుపరిచారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. చైర్మన్ రెండు రోజుల జిల్లా పర్యటన ముగిసింది. మంగళవారం గార్లదిన్నె కేజీబీవీ, మోడల్ స్కూల్, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేజీబీవీలో చదువుకున్న విద్యార్థిని నిఖిల ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన విద్యాబోధనతో పాటు, రుచికరమైన భోజనం అందించిన అంగన్‌వాడీ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఒకొక్కరికి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు.

మధ్యాహ్న భోజనం సంతృప్తికరం

పామిడి టీసీ హైస్కూల్‌ను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ చేశారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే కోడిగుడ్లు నిర్దేశిత బరువు ఉన్నాయా లేదా అని తూకం వేసి చూశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం 15తో పాటు 17వ కేంద్రాన్ని పరిశీలించారు. టీహెచ్ఆర్ పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

మెనూ పక్కాగా పాటించాలి

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా పాటించాలని చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. గుత్తి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం పెట్టకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దాసరి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ తర్వాత రజాపురం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సేవాగఢ్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడి నుంచి గుంతకల్లు కేజీబీవీ., బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్ఓ శోభారాణి, డీఈఓ సాయిరామ్, డీసీఓ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్డీఓ రవీంద్ర, సీడీపీఓలు ఉమాశంకరమ్మ, డిల్లీశ్వరి, తహసీల్దార్లు ఉషారాణి, ఆర్.వి.సునీతాబాయి, మహబూబ్‌బాషా, ఎంపీడీఓలు ప్రభాకర్‌నాయక్, ఎంఈఓలు జయానాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ప్రసవాలపై నిర్లక్ష్యమేల?

- పీహెచ్‌సీల్లో మెరుగైన సౌకర్యాలు
- అయినా ప్రసవాలపై వీడని నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సర్వజనాస్పత్రిపై అదనపు భారం



వీరు ముగ్గురూ అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్నారు. వీరిలో ఒకరిది డోన్ జిల్లా ప్యాపిలి, మరొకరిది శ్రీసత్యసాయి జిల్లా పరిగి, ఇంకొకరిది వజ్రకరూరు గ్రామం. వీరు నివాసముంటున్న ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతులన్నా ప్రసవ సమయంలో అక్కడి వైద్యులు చేతులెత్తేశారు. దీంతో ఎన్నో వ్యయప్రయాసలతో అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేరారు. నాణ్యమైన వైద్య సేవలను గ్రామీణులకు చేరువ చేయడంలో భాగంగా అన్ని పీహెచ్‌సీల్లోనూ అత్యాధునిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అయినా ప్రసవాలు చేయడంలో అక్కడి వైద్యులు నిర్లక్ష్యం చేస్తుండడంతో సర్వజనాస్పత్రిపై భారం పెరుగుతోంది.



గర్భిణులు, బాలింతలతో కిక్కిరిసిన సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డు

అనంతపురం క్రైం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా మాతాశిశు మరణాలను నియంత్రించేలా ప్రసవాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేపట్టేలా అత్యాధునిక సౌకర్యాలు కల్పించారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పీహెచ్‌సీల్లో ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రసవాల విషయంగా పీహెచ్‌సీ వైద్యులు మరీ నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఆరోగ్య శాఖ లెక్కలే నిదర్శనం. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి ప్రతి పీహెచ్‌సీలో ప్రతి నెలా 5 నుంచి 10 వరకు ప్రసవాలు విధిగా నిర్వహించాలి. నెలకు సగటున 5 ప్రసవాలు లెక్కించుకున్నా.. 45 పీహెచ్‌సీల్లో ఏడాదికి 2,700 ప్రసవాలు జరగాలి. అయితే ఇందుకు భిన్నంగా కేవలం 1,658 ప్రసవాలు మాత్రమే జరిగాయి. ఇందులోనూ ఐదు పీహెచ్‌సీలు మినహా మిగిలిన వాటిలో వంద ప్రసవాలు దాటలేదు. రాయలచెరువు, దర్గా హొన్నూరు పీహెచ్‌సీల్లో ఒక్క ప్రసవమూ జరగలేదు. పుట్లూరులో 3, ముద్దినాయనపల్లి, శ్రీరంగాపురంలో 4, యల్లనూరులో 5, బి పప్పూరులో 7, తిమ్మంపల్లిలో 8, రాప్తాడు, పి.కొట్టాలపల్లి 9, పి.కొకుంట్ల, గడేహొత్తూరులో 10, రాకెట్ల 11, బుక్కరాయసముద్రం 12, ఆవులదట్ల, గార్లదిన్నెలో 13, వజ్రకరూరు, గరుడుచేడులో 14 మాత్రమే ప్రసవాలు జరిగాయి. అత్యధికంగా డి.హీరేహాళ్‌లో 172, గుమ్మఘట్ట 128, బ్రహ్మసముద్రం 127, కుందుర్పి 115, యాడికి 110 ప్రసవాలు జరిగాయి. గడిచిన ఈ మూడు నెలల్లో శ్రీరంగాపురం, దర్గా హొన్నూరు, నాగలాపురం, రాప్తాడు, గడేహొత్తూరు, రాయలచెరువు పీహెచ్‌సీల్లో ఒక్క ప్రసవమూ జరగలేదు.

చార్జిమెమోలు జారీ చేస్తాం

ఒక్కో పీహెచ్‌సీలో 5 నుంచి 10 ప్రసవాలు తప్పనిసరిగా చేయాల్సిందే. ప్రసవాలు చేయని పీహెచ్‌సీ వైద్యాధికారులకు చార్జిమెమోలు జారీ చేస్తాం. ఈ విషయంగా ఇప్పటికే అందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ

సర్వజనాస్పత్రిపై అదనపు భారం

పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేయకపోవడంతో అత్యధిక సంఖ్యలో గర్భిణులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి చేరుకుంటున్నారు. రోజూ 25 నుంచి 30 ప్రసవాలు జరుగుతున్నాయి. అందులో 10 నుంచి 12 వరకు సిజేరియన్లు ఉంటున్నాయి. వీటిలో 15 నుంచి 20 కష్టతరమైన కేసులే వస్తున్నాయి. జీజీహెచ్‌లో ఓబీజీ విభాగంలో మొత్తం నాలుగు యూనిట్లకుగానూ 120 పడకలున్నాయి. ప్రసవాల కోసం వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు సూచనలతో ప్రొఫెసర్లు షంషాద్‌బేగం, సంధ్య, సుచిత్ర పర్యవేక్షణలో లేబర్, గైనిక్, యాంటినేటల్, పోస్టునేటల్ వార్డుల్లో ఏకంగా 240 పడకలను అందుబాటులో ఉంచారు. అయినా పడకలు తక్కువ పడుతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 350 మంది గర్భిణులు, బాలింతలు అడ్మిషన్‌లో ఉన్నారు. ఒక్కో మంచంపై ఇద్దరు, రెండు మంచాలపై ముగ్గురు చొప్పున చేర్చారు. ఈ లెక్కన సర్వజనాస్పత్రి వైద్యులు, నర్సులపై పనిభారం పెరిగి పోతోంది.

క్లుప్తంగా

మంగళకుంటలో వజ్రాల అన్వేషణ



పొలాల్లో వజ్రాల కోసం అన్వేషిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మండలంలోని మంగళకుంటలో వజ్రాలు లభ్యమవుతున్నాయి. ఈ ప్రచారం కాస్త విస్తృతం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆశావహులు తరలివస్తున్నారు. గ్రామ సమీప పొలాల్లో రైతులకు ఇటీవల సూదిముక్కు రాళ్లు, రంగురాళ్లు లభించడంతో వజ్రాలుంటాయనే నమ్మకంతో అన్వేషణ మొదలైంది. స్థానికులు తెలిపిన మేరకు కొంత కాలం క్రితం కొందరు వ్యక్తులు ఎలక్ట్రానిక్ డిటెక్టర్ల సాయంతో పరిశీలించినట్లు తెలుస్తోంది. దీంతో అప్పటి నుంచి వజ్రాల అన్వేషణ ముమ్మరంగా సాగుతోంది. ఏకంగా గుంటూరు, నెల్లూరు, పిడుగురాళ్ల ప్రాంతాల నుంచి దాదాపు 25 మంది తరలివచ్చినట్లు సమాచారం. కాగా, దీంతో తమ ప్రాంతంలోనూ వజ్రాలు లభ్యమవుతున్నాయన సమాచారంతో ఇక్కడి రైతుల్లో ఆశలకు రెక్కలొచ్చాయి.

సీఎం జగన్‌తోనే యాదవులకు సామాజిక న్యాయం

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్



అనంతపురం క్రైం: గత ప్రభుత్వం యాదవ కులస్తులను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుందని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో యాదవులకు సామాజిక న్యాయం జరిగిందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ' అని హృదయాంతరాల్లో నుంచి మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చారన్నారు. సామాజిక, రాజకీయంగా అందలం ఎక్కించారన్నారు. బీసీల్లోని ఒక్క యాదవ సామాజిక వర్గాన్నే తీసుకుంటే ఏకంగా 708 పదవులను కట్టబెట్టి కొత్త ఒరవడి సృష్టించారన్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానంలో సన్నిధి గొల్లలు తలుపులు తెరచి, తొలి దర్శనం చేసుకునే సంప్రదాయానికి దివంగత నేత వైఎస్సార్ శ్రీకారం చుట్టారన్నారు. కానీ ఆ తర్వాత టీడీపీ హయాంలో చంద్రబాబు ఈ సంప్రదాయానికి మోకాలడ్డారని విమర్శించారు. దీన్ని యాదవులు ముక్త కంఠంతో వ్యతిరేకించినా చంద్రబాబు బేఖాతరు చేసి అవమానించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే యాదవులకు మంచి రోజులొచ్చాయన్నారు. తమ మొర ఆలకించి ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరించారన్నారు. ఇప్పుడు తిరుమలలో ప్రతి రోజూ సన్నిధి గొల్లలే శ్రీవారి తలుపులు తెరిచి, తొలి దర్శనం చేసుకుంటున్నారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పాలనలో యాదవులను భాగస్వామ్యం చేయడం చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు.

మహిళ దుర్మరణం



మృతురాలు రామాంజినమ్మ

నార్పల: ఆటో నుంచి జారిపడిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని సుగాలీ కాలనీలో నివాసముంటున్న రామాంజినమ్మ (40) వెంకటేష్ నాయక్ దంపతులకు ఓ కుమార్తె ఉంది. కూలి పనులతో జీవనం సాగించేవారు. 20 సంవత్సరాల క్రితం వెంటకేష్ నాయక్ మృతి చెందాడు. అప్పటి నుంచి రామాంజినమ్మ వ్యవసాయ కూలి పనులకు వెళుతూ కుమార్తెను పెంచి పోషిస్తోంది. మంగళవారం కూలి పనులు ముగించుకుని ఆటోలో దుగుమర్రి రోడ్డు నుంచి నార్పలకు వస్తుండగా మార్గమధ్యంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహన వేగాన్ని డ్రైవర్ నియంత్రించుకోలేక పోవడంతో ఆటో ఒక్కసారిగా కుదుపులకు గురైంది. ఆ సమయంలో అదుపు తప్పి కిందపడిన రామాంజినమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

నేడు హెరిటేజ్ వాక్

అనంతపురం అర్బన్: అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం నా భూమి–నా దేశం కార్యక్రమం కింద హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకూ హెరిటేజ్ వాక్ ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు, పుర ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

మొన్న భార్య.. నిన్న భర్త

- 24 గంటల వ్యవధిలో దంపతుల ఆత్మహత్య



మంజునాథ (ఫైల్)

తాడిపత్రి: భార్య ఆత్మహత్య చేసుకున్న 24 గంటలు గడవకనే భర్త కూడా భర్త కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం సాయంత్రం చిన్నపొడమల గ్రామానికి చెందిన రమాదేవి (24) తాడిపత్రి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. భార్య ఆత్మహత్యకు పాల్పడిన కొన్ని గంటలకే భర్త మంజునాథ (25) మంగళవారం తెల్లవారుజామున తాడిపత్రి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై పడుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనలో మొండెం నుంచి తల వేరైంది. ఎడమ చెయ్యి మణికట్టు వరకు తెగింది. పెళ్లైన ఐదున్నర నెలల్లోనే దంపతులిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అన్యోన్యంగా ఉండే ఇద్దరూ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో అర్థం కావడంలేదని గ్రామస్తులు అన్నారు. అయితే రమాదేవి ఆత్మహత్య అనంతరం అత్తింటి వారి అదనపు కట్నపు వేధింపులే కారణమంటూ రైల్వే పోలీసులకు మృతురాలి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రామాంజినేయులు ఫిర్యాదు చేశారు. కొన్ని గంటలకే మంజునాథ్ కూడా ఆత్మహత్య చేసుకోవడంతో అత్త, మామ వేధింపులు తాళలేక తమ ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడంటూ రైల్వే పోలీసులకు మృతుడి తల్లిదండ్రులు ఓబుళమ్మ, బాల కుళ్లాయప్ప ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ సీఐ నగేష్ తెలిపారు.

చంద్రబాబు వల్లే పోలవరం జాప్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: పోలవరం రిజర్వాయర్ నిర్మాణ జాప్యానికి కారణం చంద్రబాబు నేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన చట్టం హామీ మేరకు పోలవరాన్ని కేంద్రం నిర్మించాల్సి ఉండగా తన సొంత కాంట్రాక్టర్లకు లబ్ధి, కమిషన్ల కక్కుర్తి కోసం తామే నిర్మిస్తామని అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అడ్డుపడ్డారని గుర్తు చేశారు. లాభాలు వచ్చే మట్టి పనులు మాత్రమే చేసి నిధులను తన సొంత ఖజానాకు మళ్లించుకున్నారని విమర్శించారు. నేడు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రాజెక్టుల సందర్శన పేరుతో మరో నయవంచనకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. వ్యవసాయం దండగా, ప్రాజెక్టులు అవసరం లేదని గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నేటికీ ఎవరూ మరువలేదన్నారు. వైఎస్సార్ హయాంలో సముద్రం పాలవుతున్న నదీజలాలను మళ్లించి రాష్ట్రాన్ని సుభిక్షం చేసేందుకు జలయజ్ఞం పేరుతో 23 ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. నాడు వైఎస్సార్ తీసుకున్న చొరవతో పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కులకు పెరిగి రాయలసీమ సస్యశ్యామలమైందన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సైతం వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. పెన్నా, సంగం బ్యారేజీలను పూర్తి చేసి జాతికి అంకితమిచ్చారన్నారు. గండికోట నిర్వాసితులకు పునరావాసం కల్పించి పూర్తి స్థాయిలో 26.85 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా మరోసారి వైఎస్సార్‌సీపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

బ్యాక్టీరియా తెగులు నివారణ చర్యలు చేపట్టండి

- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల వరుసగా కురిసిన తేలికపాటి వర్షాలు, జడివాన, బలమైన గాలులకు దానిమ్మ తోటలను ప్రమాదకరమైన బ్యాక్టీరియా మచ్చతెగులు ఆశించి, దెబ్బతీసే పరిస్థితి నెలకొందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ క్రమంలో లక్షణాలు కనిపించిన తోటల్లో రైతులు ఏ మాత్రం అలసత్వం చేయకుండా వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం రూరల్, యల్లనూరు, పుట్లూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కంబదూరు, బొమ్మనహాళ్, కణేకల్లు, పెద్దపప్పూరు, ధర్మవరం, తాడిమర్రి, గోరంట్ల, మడకశిర, పెనుకొండ, తనకల్లు తదితర మండలాల్లో 8,400 హెక్టార్లలో దానిమ్మ తోటలు విస్తరించాయన్నారు. పూత, పిందె దశలో ఉన్న తోటల్లో ఇప్పుడు బ్యాక్టీరియా తెగులు సోకి నష్టం కలగజేసే అవకాశం ఉందన్నారు.

నివారణ చర్యలు

- తెగులు సోకిన పూత, పిందె, కాయలు తీసివేసి తోట బయట కాల్చి నాశనం చేయాలి.
- రోగం సోకిన కొమ్మలు రెండు ఇంచుల కిందకు కత్తిరించి బయట పడేసి కాల్చివేయాలి. అనంతరం ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.
- 15 రోజుల తర్వాత మరోసారి ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.
- గాలిలో తేమ పెరిగినపుడు తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది. కాబట్టి జీవశిలీంద్రనాశిని 5 మి.లీ సూడోమోనాస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- డ్రిప్ ద్వారా రోజు మార్చి రోజు ఒకటిన్నర గంటకు మించి నీళ్లు పెట్టకూడదు.
- నత్రజని సంబంధిత ఎరువులు, నీటిలో కరిగే ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.
- వేప, కానుగ చెక్కను చెట్టుకు రెండు కిలోలు చొప్పున వేసుకోవాలి.

బాలికల క్రికెట్ టోర్నీ విజేత 'అనంత'



విజేత జట్టు

అనంతపురం: ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ వెంకటగిరిలో జరిగిన సౌత్ జోన్ అండర్–15 బాలికల అంతర జిల్లా క్రికెట్ టోర్నీ విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. కెప్టెన్ గౌతమి, హన్సీరెడ్డి, రోషర్ల మెరుగైన ప్రదర్శనతో జట్టును విజయతీరాలకు చేర్చడంపై జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరి డీబార్

అనంతపురం: డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు. ఈ మేరకు ఆ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించండి



వీసీలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఖరీఫ్‌లో ఇంకా విత్తనం వేయని భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారులను ఆ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. రైతుల జాబితా సిద్ధం చేస్తే ఈ నెల 20 తర్వాత 80 శాతం రాయితీతో పెసర, అలసంద, ఉలవ, కొర్ర లాంటి విత్తనాల పంపిణీకి అవకాశమిస్తామన్నారు. పంటల సాగుపై మంగళవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో 60 శాతానికి పైగా పంటలు సాగులోకి వచ్చినట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్‌లో సాగులోకి వచ్చిన పంటలకు సంబంధించి నిబంధనల మేరకు రైతు ఈ–కేవైసీతో పాటు సమగ్ర వివరాలతో కచ్చితమైన పంట లెక్కలు నమోదుచేయాలన్నారు. ఈ ప్రక్రియ పక్కాగా సాగాలన్నారు. ఏ మాత్రం తేడా వచ్చినా రైతుకు నష్టం జరిగే పరిస్థితి ఉన్నందున ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆదేశించారు. 2021 ఖరీఫ్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా కింద సాంకేతిక సమస్యతో 2,031 మంది రైతులకు రూ.5.31 కోట్లు జమ కాలేదని, ఈ అంశాన్ని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అక్టోబర్‌లో కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తెచ్చే క్రమంలో ప్రతి మండలం నుంచి ఒక రైతుకు పైలెట్ శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు పెంచాలన్నారు.

హుండీ ఆదాయం రూ.18.32 లక్షలు

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోన రంగనాథ స్వామి దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. 8 నెలలకు సంబంధించి స్వామి వారికి హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.18,32,285 సమకూరింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు, ఇనెస్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

కంబదూరు: చిరుత దాడిలో ఏకంగా 25 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన కంబదూరు మండలం అచ్చంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పెర మారెన్న తన గొర్రెల మందను మేపు కోసం మంగళవారం గ్రామ శివారు ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల మందపై ఓ చిరుత దాడి చేసింది. కకావికలమై పరుగు తీస్తున్న గొర్రెలను వెంటాడి వేటాడింది. ఘటనలో 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.2.80 లక్షలని బాధిత కాపరి మారెన్న వాపోయాడు. అటవీ శాఖ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ఎస్కేయూలో 268 పోస్టుల భర్తీకి అనుమతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం 268 భర్తీకి మార్గం సుగమమైంది. ఎస్కేయూ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన క్యాంపస్ కళాశాల విభాగాధిపతుల సమావేశం మంగళవారం జరిగింది. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం, న్యాక్ పీర్ కమిటీ పర్యటనకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నారు. వాస్తవానికి 117 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అనుమతి రాగా, ఇతర వర్సిటీల్లో అదనంగా ఉన్న పోస్టులను ఎస్కేయూకు బదలాయించారు. దీంతో ఎస్కేయూకు భారీగా పోస్టులు దక్కాయి. ఫార్మసీ కళాశాలకు ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్‌లు, పది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కో విభాగానికి ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నాలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. మొత్తం ఇంజినీరింగ్ కళాశాలకు 40 పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే క్యాంపస్ కళాశాలలో ప్రతి విభాగానికి ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నాలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. కెమిస్ట్రీ విభాగానికి ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్, ఆరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కేటాయించారు. రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్ రెండు విభాగాలను ఒకే విభాగంగా పరిగణించారు. అడల్ట్, బీఈడీ కళాశాలకు ఒక పోస్టు కూడా కేటాయించలేదు. తొలుత ఏపీపీఎస్సీ పరీక్ష అనంతరం మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు. వాస్తవానికి 260 పోస్టులు కావాలని వీసీ కోరగా, అంతకంటే ఎక్కువ పోస్టులు కేటాయించడం గమనార్హం. వీసీ కృషిపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

ఆటో మొబైల్ షాపులో చోరీ

కంబదూరు: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఓ ఆటో మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం షట్టర్‌ను పైకి లేపి రూ.30వేలు విలువ చేసే 25 చైన్ స్ప్రాకెట్లు, మడకల ప్లేట్లు 2, ఇంజన్ ఆయిల్ డబ్బాలు 8, రూ.3,500 వేలు నగదు అపహరించుకెళ్లారు. యజమాని రిజ్వాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా మహాలక్ష్మి పూజలు



అలంకరణలో శ్రీకృష్ణుడు మహాలక్ష్మి

అనంతపురం కల్చరల్: నగరంలోని లక్ష్మీ వెంకటేశ్వర ప్రసన్న భవనంలో శ్రీకృష్ణ సమేత మహాలక్ష్మి దేవికి పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో అధికమాసాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో బారులు తీరి శ్రీకృష్ణ వ్రతం చేయించారు. అనంతరం గోవింద నామస్మరణ నడుమ మహా నైవేద్యం, ప్రసాద వితరణ జరిగాయి.

అదనపు సెలవులు మంజూరు చేయండి



డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న స్టాఫ్‌నర్సుల అసోసియేషన్ నాయకురాలు చాముండేశ్వరి

అనంతపురం క్రైం: స్టాఫ్ నర్సులకు ఐదు అదనపు సెలవులు మంజూరు చేయాలని స్టాఫ్‌నర్సుల అసోసియేషన్ నాయకురాలు కోకిల చాముండేశ్వరి కోరారు. ఈమేరకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ యుగంధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం స్టాఫ్‌నర్సుల సంఘం నాయకురాళ్లు మాట్లాడుతూ స్టాఫ్‌నర్సులకు ఐదు అదనపు సెలవులు మంజూరు చేయాలన్నారు. వారం రోజులు పీహెచ్‌సీలో పని చేస్తే ఒక్క ఆఫ్ డే మాత్రమే ఇస్తారన్నారు. రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సులతో పాటు మహిళా వర్కర్, కంటిన్జెంట్ వర్కర్ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పీహెచ్‌సీల్లోని స్టాఫ్‌నర్సుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీఎంహెచ్‌ఓను కలసిన వారిలో స్టాఫ్‌నర్సులు అలివేలు, లక్ష్మి, తిరుమల, లీలావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవం



పురంధర దాస కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జగద్గురువు రామకృష్ణ పరమహంస జీవితం ఆదర్శప్రాయమని రామకృష్ణ మిషన్ స్వామి సన్నివాసానంద మహరాజ్ అన్నారు. మంగళవారం హెచ్చెల్సీ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి 19వ వార్షికోత్సవం నిర్వహించారు. సేవా సమితి గుత్తి శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ కడప జిల్లా రామకృష్ణ మిషన్ స్వామి సన్నివాసానంద మహరాజ్ పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణ పరమహంస జీవిత విశేషాలను వివరించారు. వివేకానంద భావప్రచార పరిషత్ కన్వీనర్ డాక్టర్ పీవీవీడీ నాగత్రిశూలపాణి సేవా సమితి కార్యక్రమాల వివరాలు అందించారు.

గ్రంథాలయం తనిఖీ



రామగిరి గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి రమ

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. పుస్తకాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, గ్రంథాలయ పన్ను వసూలు చేయాలని, విద్యార్థులతో సభ్యత్వం చేయించి, పాఠకుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అంబరమంటిన మొహర్రం సంబరాలు

అనంతపురం కల్చరల్: మహిమాన్వితంగా భావించే బీబీ ఫాతిమా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐదోరోడ్డు వీధుల్లో పెద్ద సరిగెత్తు సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఫాతిమా పీర్లను మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టి, చక్కెర చదివింపులు చేశారు. కులమతాలకతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు మకానం వద్ద పూజలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత అగ్నిగుండ ప్రవేశం సందడిగా జరిగింది. పెద్ద సంఖ్యలో యువకులు ఆనందోత్సాహాలతో నృత్యాలు చేస్తూ కోలాహలంగా పీర్ల జాతర చేశారు. నిర్వాహకులు హనుమంతు, నరసింహులు మాట్లాడుతూ బీబీ పాతిమా పీర్ల జలధి బుధవారం, చివరి దర్శనం ఈనెల 11న ఉంటుందన్నారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

పీర్ల మకానం వద్ద హిజ్రాల ఆరాధన

గత పదిరోజులుగా సందడిగా సాగిన పీర్ల పండుగ మంగళవారం ఉత్సాహంగా ముగిసింది. పాతూరు వీధులు జాతర్లను తలపిస్తూ జనసంద్రంగా మారాయి. ఉత్సవాలలో భాగంగా ఊరేగింపుగా వస్తున్న పీర్లకు భక్తులు బ్రహ్మరథం పట్టారు. 5వ రోడ్డులో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందిరానగర్‌లో పీర్ల మకానం వద్ద జరిగిన పూజల్లో మేయర్ వసీం చక్కెర చదివింపులు చేశారు. ముఖ్యంగా హిజ్రాల ఆటపాటలు, మకానం వద్ద ప్రత్యేకంగా చేసిన పూజలు అందరినీ ఆకర్షించాయి. పాతూరు హుసేన్ హసేన్ పీర్ల చావిడి వద్ద హిజ్రాలు లయబద్ధంగా నృత్యాలు చేశారు.



పాతూరులో నృత్యం చేస్తున్న హిజ్రాలు




రాప్తాడులో జలధికి తరలివెళ్తున్న పీర్లు

రాప్తాడు: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జిల్లాలో గూగూడు తర్వాత అంతటి స్థాయిలో మొహర్రం వేడుకలు జరిగాయి. పానకాల ఉత్సవం తర్వాత పీర్లస్వాముల జలధి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలకు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో రాప్తాడు వీధులన్నీ కిక్కిరిశాయి. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 8 గంటల వరకు పీర్లను ఊరేగించారు. భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లపు ఉంటలు పీర్లస్వాములకు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల ముందు యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు అలావ్ తొక్కారు. ఉదయం 8 గంటలకు పీర్లను హిందూముస్లింలు అగ్నిగుండ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలో వీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం ఆరు గంటలకు గుండాన్ని పూడ్చి పీర్లను జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాతూరులో జలధికి వెళ్తున్న మౌలాలీ పీరు



వేణుగోపాల్‌నగర్‌లో కొలువుతీరిన అంగార్‌వలి పీర్లు



సూర్యానగర్‌లో జలధికి తరలివెళ్తున్న పీర్లు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం తదితరులు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

అనంతపురం క్రైం: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించనన్నదే ప్రభుత్వ లక్ష్యమని మేయర్ వసీం తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థలోని నూతన సమావేశపు హాల్‌లో పీఎం స్వా నిధికి సంబంధించి వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. మేయర్ వసీం మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వీధి వ్యాపారులు అధిక వడ్డీలకు తీసుకోకుండా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సర్కార్ పొదుపు సంఘాల ద్వారా మహిళలకు రూ.లక్షల్లో రుణం ఇచ్చేలా చర్యలు తీసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం స్వా నిధి ద్వారా వీధి వ్యాపారులకు మొదటి దశలో రూ.10వేలు, రెండో దశలో రూ.20 వేలు, మూడో దశలో రూ.50 వేల వరకు అందిస్తోందన్నారు.



బ్యాంకు మేనేజర్లను సన్మానిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

3500 మందికి రుణాలు మంజూరు ..

అదనపు కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడారు. జిల్లాలోని నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో 3500 మందికి పీఎం స్వా నిధి ద్వారా రుణాలు మంజూరు చేసే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. పీఎం స్వా నిధికి సంబంధించి మొదటి దశలో రూ.4.3 కోట్లు, రెండో దశలో రూ.2.93 కోట్లు, మూడో దశలో రూ.1.20 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.8 కోట్లు లక్ష్యంగా తీసుకొని అర్హులందరికీ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 1100 వీధి వ్యాపారుల వివరాలను బ్యాంకులకు అందించినట్లు తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్లు మురళీ, నరేంద్రరెడ్డి, జ్యోతి, రాధిక మాట్లాడారు. అర్హులందరికీ రుణాలు సకాలంలో మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం రాంనగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి ప్రేమకుమారి, శ్రీకంఠం సర్కిల్ పండ్ల వ్యాపారి రమేష్, వినాయకనగర్ స్పేర్ పార్ట్స్ నిర్వాహకుడు షాషావలిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇస్హాక్, సైఫుల్లాబేగ్, మెప్మా నగర మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, సీఓలు భువనేశ్వరి, సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి అభినందన

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న జయసాయి అనే విద్యార్థిని బంగారు పతకం సాధించింది. మంగళవారం వైద్య కళాశాలలో జయసాయిని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తన చాంబర్‌లో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏపీలో విశాఖ తర్వాత సైకియాట్రి విభాగంలో బంగారు పతకం అందిస్తున్నది అనంతపురం వైద్య కళాశాలే అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల పోటీతత్వం కూడా పెరిగి, నైపుణ్యం వెలుగులోకొస్తుందన్నారు. మానసిక వైద్య విభాగం ప్రధాన విభాగాధిపతి డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ అనుమతితో తమ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ తండ్రి డాక్టర్ రామకృష్ణ చౌదరి జ్ఞాపకార్థం వైద్య విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బంగారు పతకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, సైకియాట్రి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శారద, డాక్టర్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరదరాజులు, రవికుమార్, డీ అడిక్షన్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శశాంక్, తదితరులు పాల్గొన్నారు.



జయసాయిని అభినందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

కార్మికహక్కులు కాలరాస్తున్న కేంద్రం



శ్రీకంఠం సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసిన నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: చట్టాలను సవరించి కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టనున్న మహాపడవ్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు స్థానిక శ్రీకంఠం సర్కిల్ వద్ద మంగళవారం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. బుధవారం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాపడవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు కృష్ణుడు, హరికృష్ణ, సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, నాగభూషణం, ఎఫ్‌టీయూ నాయకులు తిప్పయ్య, సురేశ్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు మండలంలోని అభివృద్ధి పనులపై అధికారులకు తెలియజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీలల్లో ప్రభుత్వం ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇంటి నిర్మాణాల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. రోజు ఏదో ఒక సచివాలయాన్ని సందర్శించి, ఇళ్ల నిర్మాణ పనులు ఏమేరకు జరుగుతున్నాయో తెలుసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్‌కు ఎంపీపీ సూచించారు. ప్రతి సచివాలయం దగ్గర ప్రతి గ్రామంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలు నాటేలా చూడాలన్నారు. ప్రభుత్వం 50 శాతం, 80 శాతం సబ్సిడీతో పెసర, రాగులు, అలసందలు, ఉలవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, నీలిమ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

'నులిపురుగుల నిర్మూలన'పై పోస్టర్ల విడుదల


ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై పోస్టర్లను డాక్టర్ దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. డాక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు, కిశోరబాలల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్ నాయక్, సర్పంచ్‌లు వరలక్ష్మి, నాగరత్నమ్మ, ఉజ్జినప్ప, ఓబులేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణానాయక్, పోతన్న పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల సరఫరా

కనగానపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నులిపురుగుల నివారణ మాత్రలు సరఫరా చేసినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. ఈ నెల 10న నిర్వహించే నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారన్నారు. వీటిని ముందస్తుగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ అలివేలమ్మ చేతుల మీదుగా మంగళవారం అందించారు. కార్యక్రమంపై స్థానిక కేజీబీవీలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఎస్‌ఓ రమాదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రామగిరి: సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ కర్రెన్న, మండల కన్వీనర్ రమేష్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాదాపురంలో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్ కుమార్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ బండారు అనిల్‌కుమార్, నాయకులు వెంకటరెడ్డి, దాసరి మోహన్, గొల్లవెంకటేష్, బోయ ఆనంద్, టీచర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



మాదాపురంలో వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

10న ముత్యాలమ్మ ఆలయ దుకాణాల వేలం

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయ సమీపంలోని దుకాణాల వేలం ఈనెల 10న ఉంటుందని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనదలిచిన వారు ఆలయ కమిటీ నిర్ణయించిన డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఎస్పీని కలిసిన ఐఓసీ సీఎం

గుంతకల్లు: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) డిపో చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఎస్పీ చాంబర్లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి సమీపంలోని ఐఓసీ డిపో వద్ద భద్రతా విషయమై చర్చించారు. పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎస్పీ చీఫ్ మేనేజర్‌కు సూచించారు. ఐఓసీ లైసెనింగ్ ఆఫీసర్ జీఏ నజీర్ పాల్గొన్నారు.

వీధిలైట్ల సమస్యలు తీర్చండి

అనంతపురం క్రైం: నగరంలో వీధి లైట్లు వెలగడం లేదన్న సమస్య రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మేయర్ వసీం అన్నారు. మంగళవారం 38వ డివిజన్‌లో మేయర్ వసీం పర్యటించారు. నగరపాలక సంస్థ సిబ్బంది నూతనంగా ఏర్పాటు చేస్తున్న లైట్లను మేయర్ పరిశీలించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరం విద్యుత్‌కాంతులతో మెరిసిపోతోందన్నారు. క్లాక్‌టవర్, రాంనగర్ ఫ్లైఓవర్లు, ఎన్‌టీఆర్ మార్గ్, విద్యుత్‌నగర్ సర్కిల్, జేఎన్‌టీయూ రోడ్డు, తదితర ప్రాంతాల్లో బటర్‌ఫ్లై లైట్లతో నగరానికి మరింత శోభ వచ్చిందన్నారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం అర్బన్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ గౌతమికి వీఆర్‌ఏల సంఘం నాయకులు విన్నవించారు. గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం ఆధ్వర్యంలో చేపట్టి రెండు రోజుల దీక్షను మంగళవారం ముగించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమిని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించి, వీఆర్‌ఏల డిమాండ్లను వివరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, పరమేశ్వరప్ప, కోశాధికారి నారాయణస్వామి, నాయకులు సుంకన్న, శ్రీనివాసులు, పెద్దన్న, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

నేటి నుంచి నా భూమి- నా దేశం

కనగానపల్లి: మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. దీనిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అలివేలమ్మతో కలసి షెడ్యూల్ విడుదల చేశారు. తొలిరోజు మండల కేంద్రం కనగానపల్లితో పాటు ముక్తాపురం, మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం: ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన మునీంద్ర హత్య కేసును ఇటుకలపల్లి పోలీసులు ఛేదించారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, ఇన్నోవా కారు, హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఇటుకలపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నరేంద్ర రెడ్డి వివరాలు వెల్లడించారు. మృతుడు తాగుడుకు బానిసై నిత్యం భార్య నల్లమ్మ, అత్త లక్ష్మీదేవిని వేధించేవాడు. విసుగుచెందిన హతుడి బామ్మర్ది నరేంద్ర, ధర్మవరానికి చెందిన వక్కల హరిప్రసాద్, కొత్తపల్లి ఆనంద్ రెడ్డి, అంగజాల వినోద్ కుమార్, శివ, వినోద్‌కుమార్‌తో కలిసి గతనెల 31న హత్యకు కుట్ర పన్నారు. హతుడు మునీంద్ర ఇంటివద్ద పంచాయతీ తాగునీటి గేట్ వాల్వ్ తిప్పుతుండగా, ఇన్నోవా కారులో వచ్చి కిడ్నాప్ చేశారు. సెంట్రల్ స్కూల్ వైపునకు తీసుకెళ్లి ఓ పొలంలో కట్టెలతో దాడి చేశారు. ఆతర్వాత 5 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి కెనాల్ వద్ద హత్య చేసి మృతదేహాన్ని వదలిపెట్టి వెళ్లారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు ఆనంద్ రెడ్డి, వినోద్‌కుమార్, శివ నేరాన్ని అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వివాద స్థలంలో నిర్మాణదారుడికి నోటీసులు

అనంతపురం క్రైం: నగరంలోని 32వ డివిజన్ ఆదర్శనగర్‌లోని సర్వే నంబర్ 272లోని విలువైన స్థలంలో నిర్మాణదారుడికి అహుడా వైస్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ నోటీసులు జారీ చేశారు. విలువైన స్థలాన్ని సమగ్రంగా సర్వే చేయాలని కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈనెల 7న జరిగిన స్పందనలో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. 46 సచివాలయం పక్కనున్న స్థలం గతంలో నగర పాలక సంస్థ పరిధిలో ఉండేదని, ఎల్‌పీ నంబర్ పరిధిలో ఉన్న స్థలానికి ఏవిధంగా ఎల్‌ఆర్‌ఎస్‌తో పాటు, భవన నిర్మాణానానికి ఎలా అనుమతి ఇస్తారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారి శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, తదితరులను ఆరా తీశారు. స్థలానికి సంబంధించి సమగ్ర నివేదిక సమర్పించాలని వారు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉండగా అహుడా వైస్‌చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ అహుడా అనుమతులకు సంబంధించి నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేశారు. దీనిపై స్థానిక కార్పొరేటర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మేయర్ వసీం, అధికారులను కలిసి సమస్య విన్నవించారు.